క్లుప్తంగా

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ



నెల్లూరు(బారకాసు) : నగరంలోని రంగనాయకులపేటలో వైఎస్సార్‌సీపీ డివిజన్ ఇన్‌చార్జి మహబూబ్‌బాషా తన నివాసంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ, పార్టీ సిటీ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. తొలుత ముస్లిం మతపెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. అనంతరం ఇఫ్తార్ విందు స్వీకరించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి, కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్, డివిజన్ కో–ఆర్డినేటర్ కందుకూరు రమేష్ పాల్గొన్నారు.

అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదం

నెల్లూరు సిటీ: అన్నదమ్ముల మధ్య ఆస్తి వివాదం హత్యాయత్నానికి దారి తీసింది. నగరంలోని ఆచారవీధికి చెందిన రాజ్‌మల్‌జైన్ దంపతులకు దిలీప్‌కుమార్‌జైన్, హితేష్‌కుమార్‌జైన్, మనోజ్‌కుమార్‌జైన్ కుమారులు ఉన్నారు. రెండో కుమారుడు హితేష్‌కుమార్ వేరుగా కాపురం ఉంటుండగా, పెద్ద కుమారుడు వద్ద రాజ్‌మల్‌జైన్ దంపతులు ఉంటున్నారు. హితేష్‌కుమార్‌కు ఆస్తిలో కొంత భాగం ఇవ్వడంతో అతను సుబేదారుపేటలో వ్యాపారం సాగిస్తున్నారు. తండ్రి ఆస్తిని పూర్తిస్థాయిలో పంపకాలు చేయాలని అన్న హితేష్‌కుమార్ ఇంటికి వెళ్లి అడుగుతుండేవారు. కొన్ని నెలలుగా అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో శనివారం అర్ధరాత్రి హితేష్‌కుమార్ ఐదుగురు స్నేహితులతో కలిసి దిలీప్‌కుమార్ ఇంటికి వెళ్లారు. ఇంటి తలుపు తీయకపోవడంతో కోపోద్రిక్తుడైన హితేష్ కుమార్ తన పిస్టల్‌తో తలుపును కాల్చాడు. బాధితులు ఆదివారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హితేష్‌కుమార్‌పై హత్యాయత్నం కింద కేసు నమోదు చేశారు.

దుస్తుల పంపిణీ



నెల్లూరు(బృందావనం) : జెడ్పీ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో పొదలకూరు రోడ్డు కొత్తూరు గిరిజన కాలనీలోని నిరుపేదలకు దుస్తులను ఆదివారం పంపిణీ చేశారు. సంఘ కార్యదర్శి ఖాజామస్తాన్, కోశాధికారి వెంకటరమణయ్య, బి.రాజగోపాల్, వీఎస్ ప్రసాద్, ఎస్.వెంకటేశ్వర రెడ్డి, మహిళా కార్యదర్శి వి.హర్షవర్ధిని, రాజేశ్వరమ్మ, పద్మ, సావిత్రమ్మ, మురుగన్, హుస్సేన్, చెంచయ్య పాల్గొన్నారు.

స్థలాన్ని కాపాడాలని వినతి

నెల్లూరు సిటీ : ఎన్టీఆర్ నగర్ బిట్–3లోని పార్కును కబ్జాదారుల నుంచి కాపాడాలని జనతా వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మంత్రి నారాయణకు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణగౌడ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్‌లో దేవాలయం, మసీదు, చర్చిలకు గతంలో స్థలాలు కేటాయించారని, వాటిని నిర్మించుకుని ప్రజలు ప్రార్థనలు నిర్వహించుకుంటున్నారన్నారు. అయితే పార్కు కోసం కేటాయించిన స్థలం ఇప్పటికీ అలాగే ఉండిపోయిందని, దానిని కొందరు కబ్జా చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జనతా వాకర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శులు మధు, పోలిచెర్ల ఉదయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు చరణ్‌తేజ, తణుకు మునిబాబు పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యం

నెల్లూరు(బృందావనం) : ధ్యానం ద్వారా మానసిక ప్రశాంతత, ఆరోగ్యం కలుగుతుందని ఎంజీబీ మాల్ మేనేజింగ్ డైరెక్టర్ గంగాధర్ తెలిపారు. పొదలకూరు రోడ్డు పద్మావతిసెంటర్ వద్ద ఉన్న హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన కేంద్రంలోని సులోచన సదన్ ఆశ్రమంలో ఆధ్యాత్మిక సత్సంగ్ ధ్యాన శిక్షణా కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు గంగాధర్ మాట్లాడుతూ ధ్యానంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మిషన్ వ్యవస్థాపకుడు లాలాజీ మహరాజ్ చిత్రాన్ని చిత్రకారుడు సోమా పద్మారత్నం పెన్సిల్ ఆర్ట్‌గా వేసి గంగాధర్‌కు అందజేశారు.

5న ఉచిత ఖత్నాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్‌బీకే చారిటబుల్ ఫౌండేషన్‌కు సంబంధించిన ఉచిత ఖత్నాల పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. పార్టీ నగరాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, ఇప్పటివరకు ట్రస్ట్ ద్వారా 3,800 మంది పేద, అనాథ ముస్లిం పిల్లలకు ఖత్నాలు చేశారని, మే 5వ తేదీ సోమవారం ఉదయం వెంగళరావునగర్‌లో ఉన్న తాతయ్య స్కూల్‌లో ఉచిత ఖత్నాలు చేసే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాల కోసం 91779 69173, 82476 92014, 79896 03905 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ స్టేడియంలో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాకర్స్‌కు బీపీ, షుగర్ పరీక్షలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు స్వర్ణ రమేష్‌బాబు మాట్లాడుతూ 350 మంది వాకర్స్‌కు పరీక్షలు చేయించామన్నారు.

వంటకు టాటా.. కర్రీస్ బాట

కర్రీస్ పాయింట్ వద్ద రద్దీ



ఉరుకులు పరుగుల జీవితంలో ప్రత్యేకమైక సమయాన్ని కేటాయించి వంటలు చేసుకోవడం చాలా మందికి కష్టతరంగా మారింది. హోటల్స్‌లో భోజనం కూడా ఖర్చుతో కూడుకుంది కావడంతో అన్నం మాత్రం వండుకుని కర్రీస్‌ను బయట కొనుగోలు చేసేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. దీంతో నగరంలో వీధికో కర్రీస్ పాయింట్లు వెలిశాయి.

- కొత్త రుచులను పరిచయం చేస్తున్న కర్రీ పాయింట్లు
- ఇళ్లలోనూ వంటావార్పుకు అప్పుడప్పుడు బ్రేక్
- పుట్టగొడుగుల్లా కర్రీస్ విక్రయ కేంద్రాలు



నగరంలోని ఓ కర్రీ పాయింట్

నెల్లూరు సిటీ : నగరంలోని కర్రీస్ పాయింట్లకు రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. అందుకు తగ్గట్లు కొత్త రుచులతో ఆహార ప్రియులకు రోజుకో ఒక స్పెషల్ కర్రీని పరిచయం చేస్తున్నారు. నాన్‌వేజ్ ఐటమ్స్‌లో కొత్త రకాలను పరిచయం చేస్తూ కర్రీస్ సెంటర్లు నగర వాసుల మన్ననలను పొందుతున్నాయి. 17 ఏళ్ల క్రితం మాగుంట లేఅవుట్ ప్రాంతంలో గంగోత్రి కర్రీస్ పాయింట్ ఏర్పాటు చేశారు. అప్పట్లో కర్రీస్ పాయింట్‌లను పరిచయం చేసింది వారే. అయితే ప్రస్తుతం ఆ కర్రీ పాయింట్ లేదు.

దాదాపు 400పైగా కర్రీ పాయింట్స్

నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో కర్రీ పాయింట్స్ అనేకం వెలిశాయి. ఒక్క స్టోన్‌హౌస్‌పేట, బాలాజీ నగర్, నవాబుపేట, కిసాన్‌నగర్, మైపాడుగేటు ప్రాంతాల్లోనే 70 కర్రీస్ పాయింట్‌లు ఉన్నాయి. అదే విధంగా హరనాథపురం, చిల్డ్రన్స్‌పార్క్, చిన్న బజారు, పెద్దబజారు, వీఆర్సీ సెంటర్, మద్రాసు బస్టాండు, దర్గామిట్ట, వేదాయపాళెం, అయ్యప్ప గుడి ఇలా ప్రధాన ప్రాంతాల్లోని అధిక సంఖ్యలో కర్రీస్ పాయింట్లు వెలిశాయి. ఇలా మొత్తం దాదాపు 400కు పైగా కర్రీస్ పాయింట్‌లు ఉన్నాయి.

నిత్యావసరాల ఖర్చులు పెరగడంతో...

గతంతో పోలిస్తే కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. దీంతో ఇంట్లో గ్యాస్, నిత్యావసర వస్తువులకు ఖర్చు చేయడం కన్నా రూ.20 నుంచి రూ.30లకు ఒక కర్రీ ప్యాకెట్ రావడంతో వాటిపైనే ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. సాంబార్, పప్పు, రసానికి కలిపి రూ.60 నుంచి రూ.80లు వెచ్చిస్తే నలుగురు వ్యక్తులు తినేందుకు సరిపోతుంది. ఇంట్లో అన్నం వండుకుని కర్రీస్ కొనుగోలు చేస్తే రోజు గడిచిపోతుంది.

జీవనోపాధికి దోహదం

హోటల్స్‌లో పనిచేసిన అనుభవం ఉన్నవారు, సొంత కాళ్లపై నిలబడాలనే ఉద్దేశంతో ఉన్న వారు కర్రీ సెంటర్ల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ఇంటి పెద్ద మాత్రమే కాకుండా ఇంట్లోని భార్య, పిల్లలు కర్రీ పాయింట్‌లో అవసరమైన పనులు ఒకరికి ఒకరు సహాయ పడుతూ బుతుకు జీవనాన్ని నెట్టుకొస్తున్నారు. ఉదయం 4 నుంచి కర్రీకి సంబంధించి కూరగాయలు, ఇతర వస్తువులను సమకూర్చుకుంటారు. ఉదయం 11 గంటలకే అన్ని రకాల కర్రీస్‌ను అందుబాటులో ఉంచుతారు. సాయంత్రానికి తిరిగి మళ్లీ వంటకాలు చేయాల్సి ఉంది. కుటుంబ సభ్యులు అందరూ కలిసి పనులను పంచుకుంటారు. వీరిలో రుచిని, నాణ్యతను అందించిన వాళ్లకు మాత్రమే ఆదరణ లభిస్తుంది.

సండే స్పెషల్స్

ఆదివారం వచ్చిందంటే నగర వాసులు సినిమాలు, షికార్లుకు వెళ్తుంటారు. రోజంతా పిల్లలతో గడుపుతుంటారు. బయట వంటకాలు రుచి చూసేందుకు ఇష్ట పడుతుంటారు. దీంతో ఆదివారం హోటల్స్‌తో పాటు కర్రీ సెంటర్‌లు కూడా ప్రత్యేకంగా నాన్‌వెజ్ రుచులను అందుబాటులోకి తెస్తుంటాయి. రాగి సంగటితో పాటు బొమ్మిడాయల పులుసు, రొయ్యలు, చికెన్, మటన్‌లో ఫ్రైలు, కర్రీల విక్రయాలు చేస్తుంటారు. సాధారణ రోజులో కన్నా ఆదివారం తమ వ్యాపారం జోరుగా ఉంటుందని కర్రీ పాయింట్ నిర్వాహకులు చెబుతున్నారు.

వివిధ రకాల పచ్చళ్లు...

కర్రీ పాయింట్లలో అనేక రకాల పచ్చళ్లు కూడా అందుబాటులో ఉన్నాయి. కొన్ని కర్రీ సెంటర్‌లు వారంలో ప్రతిరోజు ఒక్కో రకం పచ్చళ్లను అందుబాటులో ఉంచుతుంటాయి. అదే విధంగా కారపు పొడులు సైతం విక్రయిస్తున్నారు. అదే విధంగా నాన్‌వెజ్‌లో ఫ్రై ఐటమ్స్, వెజ్‌లో కూడా పలు కొత్త రకాల ఫ్రై ఐటమ్స్ అందుబాటులోకి తీసుకొచ్చారు.

వంటకాలు	ధరలు (రూ)
రసం	30-40
సాంబార్	30-40
పచ్చడి	20
పప్పు	30-40
ఆకుకూర పప్పు	30-40
మజ్జిగ పులుసు	30
తాళింపు	30
గుత్తివంకాయ కూర	30-40
చికెన్ ఫ్రై	60-100
చికెన్ కర్రీ	60-100
చేపల పులుసు	50-70

రుచి, నాణ్యత ఉంటేనే..

చాలా కాలంగా కర్రీ పాయింట్ నిర్వహిస్తున్నా. అయితే రుచి, నాణ్యత ఇవ్వగలిగితేనే కస్టమర్లు మళ్లీ మళ్లీ వస్తారు. కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు హెచ్చుతగ్గులు ఉన్నా కస్టమర్ల కోసం అందుబాటు ధరల్లో విక్రయాలు చేస్తుంటాం.

– వెంకటేశ్వర్లు, కర్రీ పాయింట్ నిర్వాహకుడు

ఇంటి ఆహారాన్ని అందిస్తున్నారు



రెస్టారెంట్‌లు, హోటల్స్‌లో మాత్రమే ఆహారం బాగుంటుందని అనుకుంటాం. కానీ చిన్నచిన్న కర్రీ సెంటర్‌లలో కూడా ఇంటి రుచులను అందిస్తున్నారు. ముఖ్యంగా రుచిని ఇవ్వగలిగితే నెల్లూరు వాసులు కర్రీస్ పాయింట్ ఎంత దూరంలో ఉన్నా వెత్తుక్కుని వెళ్తారు.

– సతీష్, ఫ్యాన్సీ షాపు నిర్వాహకుడు, వీఆర్సీ సెంటర్

అక్షయ్‌కు స్వర్ణ పతకం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : జాతీయ ఆర్చరీ పోటీల్లో నెల్లూరుకు చెందిన చాట్ల అక్షయ్ మహదేవ్ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. గుంటూరులో ఆదివారం ముగిసిన చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాన్ని సాధించి అబ్బుర పరిచారు.

ఘనంగా కవితా దినోత్సవం

నెల్లూరు(బృందావనం) : హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో ఆదివారం రాత్రి ప్రపంచ కవితా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో నెల్లూరుకు చెందిన చిన్ని నారాయణరావును సాహితీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కవితల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అనంతరం చిన్ని నారాయణరావును సన్మానించారు.

సన్మానం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'శతమానం భవతి' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అసోసియేషన్ సభ్యుల్లో ఈ నెలలో పుట్టినరోజు జరుపుకున్న వారిని సన్మానించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు హరిబాబు, నసీర్‌అహ్మద్, అధ్యక్షుడు కిలారి శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి గువ్వల నారాయణరెడ్డి, కోశాధికారి మారంరెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

కోసూరు రత్నంకు పురస్కారం



నెల్లూరు(బృందావనం) : నగరంలోని విశాలాక్షి వృద్ధుల ఆశ్రమ నిర్వాహకుడు కోసూరు రత్నం తెలుగు బుక్ ఆఫ్ రికార్డు పురస్కారం అందుకున్నారు. హైదరాబాద్‌లోని సమత గోపాల్ కళానిలయంలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయనకు అవార్డును ప్రదానం చేశారు.

విస్తృతంగా సేవా కార్యక్రమాలు



రక్తదానం చేస్తున్న యువత



కేక్ కటింగ్ చేస్తున్న పార్టీ నేతలు

- ఘనంగా అనిల్ జన్మదిన వేడుకలు

నెల్లూరు(బారకాసు) : మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను ఆయన అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు జరిపారు. నగరంలోని విజయమహల్ గేట్ సమీపంలోని రాజన్న భవన్‌లో కేక్ కటింగ్ చేసి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 170 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అలాగే శ్రావణ్ ఆధ్వర్యంలో నగరంలోని టౌన్‌హాల్ వద్ద ఉన్న వినాయకస్వామి దేవస్థానం వద్ద 101 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. బాలభవన్‌లో చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు అందించారు. రంగనాయకులపేట, జెండావీధి ప్రాంతాల్లో పేదలకు అన్నదానం చేశారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



నెల్లూరు(అర్బన్) : నగరంలోని బృందావనంలో ఉన్న దీప్తి నర్సింగ్ హోమ్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఆస్పత్రి ఎండీ, జనరల్ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ లోకనాథం, స్త్రీల గర్భకోశ వ్యాధి నిపుణురాలు డాక్టర్ సుమతి మాట్లాడుతూ తమ ఆస్పత్రి 29వ వార్షికోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు. గర్భిణులకు ఫీటల్ డాప్లర్ పరీక్ష, ఉచిత స్కానింగ్ పరీక్షలు నిర్వహించామన్నారు. సుమారు 200 మందికి పైగా రోగులకు మందులు అందజేశామన్నారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కవులకు పురస్కారాలు

నెల్లూరు సిటీ : నగరంలోని రేబాలవారివీధిలో ఉన్న జిల్లా గ్రంథాలయంలో పలువురు కవులకు పెన్నా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం పురస్కారాలు అందజేశారు. పద్య కళా పరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, కవి ఈతకోట సుబ్బారావు, మద్దూరు శ్రీనివాసులు, పెన్నా రచయితల సంఘం అధ్యక్షురాలు సుభద్రాదేవీ పాల్గొన్నారు.

మైనింగ్ కేసులో ఇద్దరు పోలీసుల అదుపులోకి

పొదలకూరు: తాటిపర్తి పంచాయతీ రుస్తుం మైన్ వ్యవహారంలో పోలీసులు అరెస్ట్‌ల పర్వం కొనసాగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన నాయకులను లక్ష్యంగా చేసుకుని కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు ఆరోపిస్తున్నారు. గతనెల 16న పొదలకూరు పోలీస్‌స్టేషన్లో మైనింగ్ డీడీ రుస్తుం మైన్లో అక్రమంగా తెల్లరాయిని తరలించారని ముగ్గురు వైఎస్సార్‌సీపీ నాయకులు పేర్నేటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వాకాటి శ్రీనివాసులురెడ్డి, వాకాటి శివారెడ్డిలపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసులో వారు ముందస్తు బెయిల్ పొందినట్లు తెలిసింది. ఈ క్రమంలో అదే కేసుకు సంబంధించి మరో ఇద్దరిని ఆదివారం పొదలకూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. గూడూరుకు చెందిన కొండా శివారెడ్డి, నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండకు చెందిన వేమిరెడ్డి అరవింద్‌కుమార్‌రెడ్డిలను కేసులో చేర్చి అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. డీడీ అందజేసిన ఫిర్యాదులో ముగ్గురితోపాటు మరికొంతమంది అని పేర్కొనడంతో పై ఇద్దరినే కాక మరో ఇద్దరి పేర్లు కూడా చేర్చినట్లు సమాచారం.

మర్యాదపూర్వకంగా..

నెల్లూరు సిటీ : ఉమ్మడి నెల్లూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలను వారి నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ప్రెసిడెంట్ జీవీ ప్రసాద్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ ఎస్.ప్రభాకర్‌రావు, ట్రెజరర్ మహబూబ్‌బాషా, బాలకృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నెత్తిన పన్నుల భారం



రౌండ్ టేబుల్ సమావేశంలో నేతలు

నెల్లూరు(బృందావనం)/నెల్లూరు(వీఆర్సీ సెంటర్): నగరపాలక సంస్థ బడ్జెట్ ప్రతిపాదనలను చూస్తే రానున్న సంవత్సరంలో ప్రజల నుంచి రూ.222 కోట్ల పన్నులను ముక్కుపిండి వసూలు చేయనున్నారనే అంశం అర్థమవుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ 2025–26 బడ్జెట్‌పై వివిధ రాజకీయ పక్షాలు, ప్రజాసంఘాలు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో రౌండ్ టేబుల్ సమావేశాన్ని పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో సీపీఎం నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగరాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, సీపీఐ నేత రామరాజు, సీపీఐ (ఎమ్మెల్) న్యూ డెమోక్రసీ నేత రాంబాబు మాట్లాడారు. కుళాయి, ఇంటి పన్నుల మోత మోగించనున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన నామమాత్రపు గ్రాంట్లు రాబట్టలేక చేతులెత్తేశారని ధ్వజమెత్తారు. ఈ విషయంలో మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. అనంతరం పలు అంశాలపై తీర్మానాలు చేశారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు పెంచనున్న రూ.222 కోట్లలో ఇంటి పన్నుల రూపంలో రూ.100 కోట్లు, కుళాయి పన్నులు, యూజర్ చార్జీల పేరుతో మరో రూ.122 కోట్లు వసూలు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో నేతలు కొండా ప్రసాద్, నాగేశ్వరరావు, మస్తాన్‌బీ, పెంచలనరసయ్య, సూర్యనారాయణ, శ్రీనివాసులు, బాబు, మాల్యాద్రి, కత్తి పద్మ పాల్గొన్నారు.

దాతల సాయం అభినందనీయం



మాట్లాడుతున్న మంత్రి నారాయణ

- ఖాళీ స్థలాన్ని పార్కుగా తీర్చిదిద్దుతా

నెల్లూరు సిటీ : ఆర్టీసీ బస్టాండులో స్టీల్ బెంచీల ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్‌లో స్టీల్ బెంచీల ఏర్పాటును ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ శుభమస్తు ఫౌండేషన్ ద్వారా స్టీల్ బెంచీలు ఇచ్చిన బయ్యా శ్రీనివాసులు, భయ్యా రవిలను అభినందించారు. కార్యక్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, డిపో మేనేజర్ శివకేశవ్‌యాదవ్, మురళీకృష్ణ పాల్గొన్నారు.

దోమల రహితంగా తీర్చిదిద్దుతా

అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ సిస్టమ్‌ను తీసుకొచ్చి నగరాన్ని దోమల రహిత నగరంగా తీర్చిదిద్దుతానని మంత్రి నారాయణ పేర్కొన్నారు. ఆర్టీసీ బస్టాండులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. సీఎం సూచనల మేరకు నెల్లూరుకు త్వరలో ఎలక్ట్రిక్ బస్సులు వస్తున్నాయన్నారు.

బోడిగాడితోటలోని ఖాళీ స్థలాన్ని పార్కుగా తీర్చిదిద్దుతానని మంత్రి నారాయణ అన్నారు. నగరంలోని బోడిగాడితోటలో ఆయన ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాధుల తోట పక్కన ఉన్న ఖాళీ స్థలంలో అన్ని హంగులతో సుందరమైన వాతావరణం పార్కులో ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే పార్కులో 200 మంది కెపాసిటీతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలన్నారు. కమిషనర్ సూర్యతేజ, అదనపు కమిషనర్ నందన్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



ప్రదర్శన చేస్తున్న వివిధ సంఘాల నాయకులు



పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో..



డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో..



వీఆర్సీ సెంటర్‌లో..

నెల్లూరు (టౌన్) : స్థానిక సండేమార్కెట్ సమావేశ మందిరంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ, నవయువ సమాఖ్య ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజుగురు సుఖదేవల వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీబొమ్మ నుంచి కనకమహల్ వరకు ప్రదర్శన చేశారు. అనంతరం పీడీఎస్ఓ పూర్వ నాయకులు కృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు ఓంకారం, రాజు మాట్లాడుతూ భగత్‌సింగ్‌ను నేటి యువత ఆదర్శంగా తీసుకుని దేశసేవలో తరించాలని పిలుపునిచ్చారు. నాగరాజు, యానాదయ్య, శరవణన్ పాల్గొన్నారు.

- నేటి యువత భగత్‌సింగ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్ తెలిపారు. భగత్‌సింగ్ వర్ధంతి వేడుకలను పీడీఎస్‌యూ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు ఖాదర్‌మస్తాన్, నవీన్, చరణ్, హర్ష పాల్గొన్నారు.
- నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని పలు ప్రాంతాల్లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ చిత్రపటాలకు నివాళులర్పించారు. డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ, నాయకులు తిరుపతి, జగదీష్, శేఖర్, ఖాజావలీ, అనిల్, సుధాకర్, మస్తాన్, నాగేశ్వరరావు, సూర్యనారాయణ, జాఫర్, వెంకటేష్ పాల్గొన్నారు.
- సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్‌షరీఫ్, నాయకులు సాయి, జీవన్, బాదుల్లా, గౌస్, సుల్తాన్ పాల్గొన్నారు.
- భగత్‌సింగ్ ఆశయసాధనలో డీవైఎఫ్ఐ ముందుందని ఆ సంఘ నగర కార్యదర్శి నరసింహ అన్నారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతి సందర్భంగా నగరంలోని కనకమహల్ సెంటర్‌లోని పుచ్చలపల్లి సుందరయ్య విగ్రహం నుంచి గాంధీ బొమ్మ సెంటర్ వరకు కాగడాలతో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, నాయకులు నాగేశ్వరరావు, సూర్యనారాయణ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ, నాయకులు పాల్గొన్నారు.
- నెల్లూరు(బృందావనం) : భగత్‌సింగ్, సుఖ్‌దేవ్, రాజ్‌గురులకు కేంద్రం భారతరత్న ప్రకటించాలని మాస్టర్‌ఆఫ్ సోషల్ వర్క్ సొసైటీ అధ్యక్షుడు ఎన్.మస్తాన్ కోరారు. నగరంలోని వీఆర్సీ సెంటర్‌లో వారి వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. తొలుత వారి చిత్రపటాలకు నివాళులర్పించారు.

నిషేధిత ప్లాస్టిక్‌కు స్వస్తి పలకండి



స్టోన్‌హౌస్‌పేటలోని ఓ దుకాణంలో ప్లాస్టిక్ ఉత్పత్తులను తనిఖీ చేస్తున్న కమిషనర్

నెల్లూరు(బారకాసు) : పర్యావరణ పరిరక్షణ కోసం నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి పలకాలని కమిషనర్ సూర్యతేజ కోరారు. ఈ మేరకు ఆయన నగరంలో ప్రత్యేక తనిఖీలను ఆదివారం నిర్వహించారు. స్థానిక స్టోన్‌హౌస్‌పేట ప్రాంతంలోని వివిధ దుకాణాలను తనిఖీ చేసి నిషేధిత ఉత్పత్తులు ఉన్న ఒక దుకాణ నిర్వాహకుడికి రూ.వెయ్యి జరిమానా విధించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులను ఫంక్షన్‌లు, వివాహ వేడుకలు, శుభకార్యాల్లో కేటరింగ్ నిర్వాహకులు వినియోగించకూడదన్నారు. ప్రజలు కూడా బాధ్యతగా భావించి జనప నార, కాగితం, గుడ్డ సంచులను మాత్రమే వినియోగించాలని కోరారు. ఆదేశాలను అతిక్రమించిన వారిపై భారీ జరిమానాలు విధిస్తామని కమిషనర్ హెచ్చరించారు. కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ నందన్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, సిబ్బంది పాల్గొన్నారు.

యానాదుల అభివృద్ధికి కృషి

నెల్లూరురూరల్ : రాష్ట్రంలో యానాదులు చాలా వెనుకబడి ఉన్నారని, వారి అభివృద్ధికి కృషి చేస్తానని యానాది సంఘాల మహాకూటమి రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల వెంకటపతి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యానాదులకు ఆధార్, రేషన్‌కార్డులు, జాబ్ కార్డులు లేనందున వివిధ పథకాలు పొందలేకపోతున్నారని, తమకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ మేరకు ఎంపీలు, ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి వివరిస్తామని తెలిపారు. సరస్వతమ్మ, సుబ్బయ్య, కళావతి, ఏకొల్లు సుధీర్‌బాబు, కోటయ్య పాల్గొన్నారు.